క్లుప్తంగా

విధిగా ఓటును వినియోగించుకోండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ శేషన్న, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పవన్‌కుమార్

తెనాలిఅర్బన్: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటుకున్న విలువ అత్యున్నమైనదని , పౌరులు ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా కొత్తపేటలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కార్యాలయంలో మంగళవారం ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఏవీఆర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ మంచి పాలకులు రావాలంటే మంచి నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఓటు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష, ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ బి.లక్ష్మానాయక్, సీనియర్ అసోసియేట్ టి.చందన, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావుతోపాటు మున్సిపల్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఆర్ జేసీ, పాలిటెక్నిక్ నమూనా ప్రవేశపరీక్ష



విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న దృశ్యం

తెనాలిఅర్బన్: ప్రకాశంరోడ్డులోని జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ లపై నమూనా ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ రాఘవరావు పోటీపరీక్షల్లో విద్యార్థులు పాటించాల్సిన సలహాలు, సూచనలు అందించారు. అనంతరం ప్రవేశపరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జెట్టి విజయశేఖర్, డాక్టర్ జానకీరామ్, కె.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి...

- ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో చేరిన 32వవార్డు టీడీపీ అధ్యక్షుడు, ఇతర కార్యకర్తలు
- ఇరుపార్టీలకు చెందిన 50 మంది చేరిక



ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో పార్టీలో చేరిన కార్యకర్తలు

తెనాలి: తెనాలి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది. టీడీపీకి తొలి నుంచీ అంటిపెట్టుకున్నవారు సైతం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు ఫిదా అవుతున్నారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పట్టణ 32వ వార్డు కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, రాజేశ్వరరావు, తెనాలి పట్టణ ఈడ్‌గా అధ్యక్షుడు సయ్యద్ గౌస్ ఆధ్వర్యంలో అదే వార్డు టీడీపీ అధ్యక్షుడు కొమ్ము ఆశీర్వాదం, తన మిత్రబృందం సహా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో వీరంతా చేరారు. ఈ మేరకు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

చేసిన మంచి..ఆకర్షించింది

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద, మధ్యతరగతి వర్గాల జీవన ప్రమాణాలను పెంచడం, ఆయన సహకారంతో ఎమ్మెల్యే శివకుమార్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి తమను ఆకర్షించాయని కొమ్ము ఆశీర్వాదం చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తెనాలి పట్టణంలో 20 వేల మందికి పైగా పేదలకు ఇళ్లస్థలాల పట్టాలను, రిజిస్ట్రేషను పత్రాలతో అందించటం గొప్ప విషయమన్నారు. ప్రజలకు ఇంతగా మేలుచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని, తెనాలి నుంచి అన్నాబత్తుని శివకుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని నిర్ణయించుకున్నట్టు ఆశీర్వాదం స్పష్టం చేశారు.



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శివకుమార్

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి

తెనాలి: టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో సాయంత్రం పట్టణ 26వ వార్డు కౌన్సిలర్ షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో షేక్ సైఫ్ ఆలీ, షేక్ షాదుల్లా మిత్ర బృందం 50 మందికి పైగా టీడీపీ, జనసేన కార్యకర్తలు తెనాలి అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో చేరారు. ఎమ్మెల్యే శివకుమార్ వీరికి పార్టీ కండువాలను కప్పి స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషిచేస్తామని వారంతా హామీనిచ్చారు.

అటు సతీమణి.. ఇటు తనయులు

- ప్రజలను అభ్యర్థించిన అన్నాబత్తుని శివకుమార్ సతీమణి
- ప్రచారంలో తనయులు సత్యనారాయణ, అఖిల్ గణేష్

తెనాలిఅర్బన్: వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. 38వ వార్డు రెండో రోజు ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాభివృద్ధిని వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌లు సయ్యద్ ఖాలేదా నసీమ్, అళ్ళమూరి విజయలక్ష్మి కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ కాలేషా వలీ, గుర్రం హేమలత, చెరుకూరి సురేశ్ రెడ్డి, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద్, నీలి అజయ్, పెసర్లంక రమణ, పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రెండో అవకాశమివ్వండి:అఖిల్ గణేష్

చివలూరు(కొల్లిపర): వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామంటూ తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని అఖిల్‌గణేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని చివలూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక నాయకులతో రెట్టింపు ఉత్సాహంతో ప్రచారంలో పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. తన తండ్రి శివకుమార్ ను ఆదరించి విజయం అందించాలని అఖిల్ గణేశ్ ప్రజలను అభ్యర్థించారు. ర్యక్రమంలో సర్పంచ్ బొంతు వేణుగోపాలరెడ్డి, ఎంపీటీసీ కారుమంచి పృథ్వీకుమార్, బాదం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి:అన్నాబత్తుని సత్యనారాయణ

తెనాలిరూరల్: కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని సత్యనారాయణ చౌదరి అన్నారు. రూరల్ మండల గ్రామం అంగలకుదురులో మంగళవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఐదేళ్లలో అందిన పథకాల ను వివరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చౌదరి ప్రజలతో మాట్లాడుతూ 2019 ఎన్నికల సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసి రాజకీయాలంటే ప్రజలకు విశ్వసనీయత నెలకొల్పారన్నారు. గ్రామ స్థాయిలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి దేశం గర్వపడేలా ఆదర్శ పాలనను అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకు వేసి తన తండ్రి అన్నాబత్తుని శివకుమార్,, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్యను గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట ఉరిటి నాగేశ్వరరావు, గాలి శివనారాయణ, బడుగు శివ, బండి శివనారాయణ, మొవ్వ ఆనంద్ ప్రసాద్, ఉరిటి మల్లి, సూరిదేవర పూర్ణం, సాయి, కావూరి కిషోర్, సాధు ఏడుకొండలు, షేక్ మీరసా ఉన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి పుష్ప, చైర్‌పర్సన్ రాధిక



చివలూరు లో ఎన్నికల పచారం నిర్వహిస్తోన్న ఎమ్మెల్యే తనయుడు అఖిల్ గణేష్



ఇంటింటి ప్రచారంలో సత్యనారాయణ, పార్టీ నేతలు

వైభవం..పేరంటాళ్లమ్మ కల్యాణం

వల్లభాపురం(కొల్లిపర): మండల పరిధిలోని వల్లభాపురంలో శ్రీ సర్విరెడ్డి పేరంటాలమ్మ దేవస్థానంలో మంగళవారం రాత్రి అమ్మవారి కల్యాణం ,పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవాలు కన్నులపండుగగా జరిగాయి. ఉదయం నుంచి అధిక సంఖ్యలో మహిళలు తమ కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పేరంటాళ్లమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. రైతులు తమ పాడి పశువులను ఆలయం చుట్టూ తిప్పి పాడి అభివృద్ధి చెందాలని వేడుకున్నారు. రాత్రి నిర్వహించిన అమ్మవారి కల్యాణ మహోత్సవంలో పలు ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి అక్షింతలు, తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ప్రత్యేక పూజల్లో అన్నాబత్తుని..

వైఎస్సార్ సీపీ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సాయంత్రం ఆలయంలో పేరంటాలమ్మ తల్లిని దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆయన వెంట పార్టీ నాయకులు అవుతు పోతిరెడ్డి , అవుతు శేఖరరెడ్డి, అవుతు నగేష్ రెడ్డి, అవుతు సీత, ఆరిగ చంద్రారెడి, ఆలయ కమిటి ప్రతినిధులు ఉన్నారు. తిరునాళ్లలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పేరంటాలమ్మ ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

వైఎస్సార్ సీపీ కొల్లిపర మండల ఎన్నికల కమిటీ ఏర్పాటు

కొల్లిపర(తెనాలి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కొల్లిపర మండల ఎన్నికల మానిటరింగ్ కమిటీని నియమించినట్టు పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మందపాటి శేషగిరిరావు ఓ ప్రకటనలో తెలిపారు. కొల్లిపర ఎన్నికల మానిటరింగ్ కమిటీ సభ్యులుగా పార్టీ నాయకులు ఆరిగ చంద్రశేఖర్‌రెడ్డి (మున్నంగి), బొమ్ము శ్రీనివాసరెడ్డి (బొమ్మువానిపాలెం), భట్టిప్రోలు శ్రీనివాసరావు (కొల్లిపర), మోర్ల శ్రీనివాసరావు (తూములూరు), కనపర్తి అనిల్ (అత్తోట), దేశబోయిన కోటేశ్వరరావు (అత్తోట) నియమించినట్టు ఆయన వివరించారు.

వార్డు సచివాలయంలో చోరీ

తెనాలిరూరల్: వార్డు సచివాలయంలో చోరీపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్ లింగారావు వార్డు రెండో సచివాలయం తాళాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారు. లోనికి వెళ్లి కౌంటరులో ఉంచిన రూ. 26,314 అపహరించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న /చ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

చీరలు, భోజన ప్యాకెట్ల పంపిణీ

తెనాలిఅర్బన్: పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు దిలీప్‌రాజా ఆధ్వర్యంలో పట్టణంలోని పేదలు, యాచకులకు మంగళవారం భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలాగే పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న దిలీప్‌రాజా

25 నుంచి వేసవి శిక్షణ శిబిరం

తాడేపల్లిరూరల్: మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి మే 5వ తేదీ వరకు బాలల హరివిల్లు-2024 వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ తెలిపారు. తాడేపల్లిలోని ఓ ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశం మంగళవారం వివరాలు వెల్లడించారు. బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ పది రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాన్ని అమరావతి ఐకాన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్నామని చెప్పారు. 4 నుంచి 6వ తరగతి వరకు జూనియర్స్‌గా, 7 నుంచి సీనియర్స్‌గా విభజించి బెస్ట్ ఫ్రమ్ వేస్ట్, నిత్యజీవితంలో సైన్స్, పాటలు, చిత్రలేఖనం, కథలు రాయించడం, హ్యాండ్ రైటింగ్, మ్యూజిక్, గణితం, సులభంగా ఇంగ్లిష్ నేర్చుకోవడం వంటి రంగాల్లో నిష్ణాతులైన వారిచే శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.